క్లుప్తంగా

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే నాగిరెడ్డి కృతజ్ఞతలు



సీఎం జగన్ మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కలుసుకున్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆయన్ను శాసనసభలో కలుసుకొని గాజువాక నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించారు. హౌస్ కమిటీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం, గాజువాకలో ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం, రోడ్ల అభివృద్ధి తదితర అంశాలపై ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీకృష్ణా విద్యార్థి ప్రతిభ



రామతేజను అభినందిస్తున్న బలరామకృష్ణ

గాజువాక: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించిన 36వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 2022–23 పోటీలలో స్థానిక శ్రీకృష్ణా జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.రామతేజ ప్రతిభ ప్రదర్శించాడు. అండర్–18 విభాగంలోని మిడ్ లే రిలే పోటీలో బంగారు పతకం, 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా రామతేజను కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ బి.ప్రసాదరావు అభినందించారు.

యాదవ సంఘం భవనానికి స్థల కేటాయింపుపై హర్షం



మేయర్ హరి వెంకటకుమారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వంశీకృష్ణ యాదవ్

పెదగంట్యాడ: విశాఖలో యాదవ సంఘం భవనానికి 500 చదరపు గజాలు స్థలం కేటాయించడం హర్షణీయమని 75వ వార్డు యాదవ సంఘం ఉపాధ్యక్షుడు కురందాస్ వంశీకృష్ణ యాదవ్ అన్నారు. ఈ మేరకు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. మేయర్‌ను కలిసిన వారిలో చొప్ప నాగరాజు ఉన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలని వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న కమిటీ నాయకులు

ఉక్కునగరం: పదవీ విరమణ ఉద్యోగులకు ఈపీఎస్ 95 పెన్షన్ కనీసం రూ.9 వేలతో పాటు దానిపై డీఏ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈపీఎస్ 95 కమిటీ నాయకులు కోరారు. ఈపీఎస్ 95 జాతీయ ఉపాధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు నేతృత్వంలో కమిటీ ప్రతినిధులు బుధవారం కలెక్టర్ తరఫున డీఆర్వో కె. మోహన్ కుమార్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ వినతిని ప్రధాని మోదీకి పంపాలని కోరారు. జాతీయ కార్యదర్శి టి.ఎస్.ఆర్. కృష్ణారెడ్డి, జాతీయ సంయుక్త కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ, డాక్టర్ కె.రాజేష్‌కుమార్, డి.సంపూర్ణం, ఎం.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి మీ చెంతకు..



జగనన్న చెబుదాం కార్యక్రమానికి హాజరైన అధికారులు, అర్జీదారులు

- అందుకే మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం' నిర్వహణ
- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
- ప్రజల నుంచి వినతుల స్వీకరణ

పెదగంట్యాడ: 'మీ సమస్యలు చెప్పండి.. సత్వరం పరిష్కరిస్తాం. ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకే మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి' అని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. పెదగంట్యాడ మండలంలోని ఆటోనగర్ రోడ్డు నెం.10లో గల పీఐడబ్ల్యూఏ (పీవా) కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు ఏకరువు పెట్టారు. కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు కూడా పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ప్రతీ అర్జీని పరిశీలిస్తాం

కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం జిల్లా స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు మండల స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ప్రతీ మండలాన్ని కవర్ చేసే విధంగా, ప్రజల విజ్ఞప్తులకు నాణ్యమైన పరిష్కారాలు అందించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ అర్జీని జగనన్నకు చెబుదాం (జేకేసీ) పోర్టల్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. వచ్చిన అర్జీలు 90 శాతం సచివాలయాల పరిధిలోనే ఉంటున్నాయని, ఈ మేరకు పలు సమస్యలకు వేదిక వద్దే పరిష్కారం లభిస్తోందని కలెక్టర్ తెలిపారు.

68 వినతులు

కార్యక్రమాలపై పలు గ్రామాల నుంచి వివిధ సమస్యలపై 68 వినతులు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈ అర్జీలలో ప్రధానంగా రెవెన్యూ, జీవీఎంసీ, హౌసింగ్ తదితర శాఖలకు చెందినవే ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని సకాలంలో పరిష్కరించి సరైన సమాధానాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు సత్వరం పరిష్కరించాలని, పరిష్కారానికి వ్యవధి అవసరమైతే అర్జీదారులకు కారణాలు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వై.శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి, జోనల్ కమిషనర్ సింహాచలం, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో పాటు పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

64వ వార్డు పరిధిలోని తిప్పల అరుణాచినఅప్పారావు కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున తెలిపారు. కాలనీ వాసులు ఖాళీ బిందెలతో నిరసన తెలపడంతో, దీనిపై సమాచారం అందుకున్న కలెక్టర్ వెంటనే వారితో చర్చించారు. ఆ కాలనీలో సంపు నిర్మాణానికి టెండర్లు పిలిచామని, త్వరలోనే దానిని నిర్మించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళకారులు వెనుదిరిగారు.

కాలుష్యంపై గంగవరం వాసుల విజ్ఞప్తి

స్థానిక పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా వ్యాధులబారిన పడుతున్నామని గంగవరం, దిబ్బపాలెం వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

యారాడ భూ సమస్యపై వినతి

భూ సమస్యపై యారాడ వాసులు కలెక్టర్‌కు విన్నవించగా.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: దిబ్బపాలెం 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో ఈ నెల 29న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దిబ్బపాలెం 11కేవీ ఫీడర్ పరిధిలో గొడ్డువానిపాలెం, గొందేశివీధి, కండిపిల్లి వీధి, వెంకన్నపాలెం, కొంగపాలెం, సత్యనారాయణపురం, యాతపాలెం, అరుణాచినఅప్పారావు కాలనీ, గంగవరం, బడివారివీధి, జాలరిపల్లిపాలెం, ధారకొండ వీధి, దిబ్బపాలెం ఆర్‌హెచ్ కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

సత్తిరాజుకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ధ్రువపత్రం అందుకుంటున్న సత్తిరాజు

పెదగంట్యాడ: జగ్లర్‌గా, సింగర్‌గా, మెజీషియన్‌గా ప్రాచుర్యం పొందిన ఆళ్ల సత్తిరాజుకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. స్థానిక సంస్కార్ స్కూల్ ఆవరణలో జగ్లిన్ షో చేయడంతో పాటు ట్రాక్ సాయంతో సినిమా పాట పాడి అద్భుతమైన ఫీట్ సాధించాడు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వైజాగ్ చీఫ్ కో–ఆర్డినేటర్ కోరుకొండ రంగారావు చేతుల మీదుగా సత్తిరాజుకు ధ్రువ పత్రం, మెమెంటో, గోల్డ్‌మెడల్, బ్యాడ్జ్ అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జబర్దస్త్ సత్తిపండు, స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ చిట్టిబాబు, సంస్కార్ స్కూల్ డైరెక్టర్ ఎస్.ఎస్.నివాస్ తదితరులు హాజరై సత్తిరాజును అభినందించారు. కార్యక్రమంలో బెల్లాల నాగేశ్వరరావు, నూకరాజు, అప్పలకొండ, పావని పాల్గొన్నారు.

'ఉక్కు'ను కాపాడుకుంటాం

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం
- లంకెలపాలెం చేరిన బైక్ యాత్ర



మాట్లాడుతున్న లోకనాథం

అగనంపూడి: ఆంధ్రులు హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేస్తామంటే ఊరుకునేది లేదని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. ఐక్య పోరాటాలతో స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రక్షణ యాత్ర లంకెలపాలెం చేరుకుంది. ఈ సందర్భంగా లంకెలపాలెం కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నారని, దీన్ని ప్రతిఘటించకపోతే ఒక్క ప్రభుత్వరంగ సంస్థ కూడా మిగలదని అన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం ఈ నెల 20న ప్రారంభమైన బైక్ యాత్ర వచ్చే నెల 5న కూర్మన్నపాలెంలో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జి.సత్యనారాయణ, పి.మాణిక్యం, వెంకటరావు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఆధ్వర్యంలో డ్రైవింగ్ శిక్షణ



డ్రైవింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సింగ్

పెదగంట్యాడ: యువతీ యువకులకు ఉపాధి శిక్షణ ఇచ్చి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా చర్యలు చేపట్టామని ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సింగ్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు చినపాలెంలోని యువతీ యువకులకు ఎన్టీపీసీ ఆధ్వర్యంలో సీఎస్సార్ కార్యక్రమం కింద లైట్ మోటార్ వెహికల్ (ఎల్‌ఎంవీ) డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని కార్పొరేటర్ బట్టు సూర్యకుమారితో కలసి బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 45 రోజుల స్వల్పకాలిక శిక్షణ కోసం 16 మంది మహిళలు, నలుగురు యువకులు మొత్తం 20 మందిని ఎంపిక చేశామన్నారు. ఈ శిక్షణ పూర్తయిన అనంతరం రెండో బ్యాచ్‌కు శిక్షణ ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్టీపీసీతో కలసి గతంలో రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ హెచ్‌ఆర్ హెడ్ రుమాడే శర్మ, ప్రకాశ్, ఎన్టీపీసీ అధికారులు, ఐటీఐ ట్రైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం



జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



మన మట్టి .. మన దేశం ర్యాలీలో నినాదాలు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కూర్మన్నపాలెం: దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర వీరులను స్మరించుకోవడం అందరి కర్తవ్యమని కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశరావు అన్నారు. మహనీయుల త్యాగాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మన దేశం.. మన మట్టి పేరుతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కొనియాడుతూ విద్యార్థులు నినాదాలు చేశారు. మట్టిని కలశాల్లో సేకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ప్రతీ పౌరుడిలో దేశభక్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. జాతీయ నాయకుల చిత్రపటాలు, జాతీయ జెండాలు చేతపట్టుకుని విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



వృద్ధునికి బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే 68, 69వ వార్డుల్లో జోరుగా సాగుతోంది. సచివాలయం ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు, షీలానగర్ మనీషా స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు సంయుక్తంగా బుధవారం ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. వృద్ధులకు, మహిళలకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఆరోగ్య సమస్యలు ఉంటే అక్టోబర్ 12న మింది గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వహించి, నెలకు సరిపడిన మందులను అందజేస్తారని సచివాలయం ఏఎన్‌ఎం మహాలక్ష్మి తెలిపారు.

36 రకాలు.. 5 వేల మొక్కలు

ఉత్సాహంగా ఉక్కు వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న ఉక్కు అధికారులు, 'సత్యసాయి' ప్రతినిధులు

అగనంపూడి: జాతీయ రహదారి అగనంపూడి సమీపంలో స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి చేసిన మూడు ఎకరాల స్థలంలో మొక్కలు నాటారు. సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, సేవకులు, ఉక్కు అధికారులు పాల్గొని సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని పండగలా చేపట్టారు. ఉక్కు అధికారులు జి.సుబ్రహ్మణ్యం, సత్యసాయి సేవా సమితి విశాఖ జిల్లా అధ్యక్షుడు టీఆర్‌ఎస్‌ఎన్ నాయుడు ఆధ్వర్యంలో 36 రకాలకు చెందిన 5వేల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉక్కు ఆగ్రో ఫారెస్ట్ డీజీఎం వీఎల్‌పీలాల్, సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కన్వీనర్ అమ్మాజీ, ప్రతినిధులు రామకృష్ణ, బాబూరావు, గజేంద్రరావు, హనుమతురావు, ఉదయ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఇంటర్ స్టీల్ వాలీబాల్ పోటీలు



రూర్కెలాతో పోటీలో గెలుపొందిన స్టీల్‌ప్లాంట్ వాలీబాల్ జట్టు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఇంటర్ స్టీల్ వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డు (ఎస్‌పీఎస్‌బీ) ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉక్కు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన నాలుగు రోజుల పోటీల్లో భాగంగా బుధవారం 15 పోటీలు జరిగాయి. పోటీల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్ జట్టు రూర్కెలా జట్టుపై 25–13, 25–14 స్కోరుతో గెలుపొందింది. బర్న్‌పూర్ జట్టు దుర్గాపూర్ జట్టుపై 25 –16, 23 – 25, 25 – 22 స్కోరుతో విజయకేతనం ఎగరవేసింది. టిస్కో జట్టు భిలాయ్ జట్టుపై 19–25, 25–19, 25–20 స్కోరుతో గెలిచింది. భిలాయ్ జట్టు రూర్కెలా జట్టుపై 20–25, 25–10, 25–22 స్కోరుతో గెలుపొందింది. స్టీల్‌ప్లాంట్ జట్టు బొకారో జట్టుపై 25–19, 25–23 స్కోరుతో విజయకేతనం ఎగరవేసింది. స్పోర్ట్స్ విభాగాధిపతి అమిత్ ఘదాయ్ పర్యవేక్షణలో విభాగం అధికారులు పలువురు పాల్గొన్నారు.

వినాయకుడి సన్నిధిలో అన్న సమారాధన



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న దేవన్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్‌లో కొలువుదీరిన వరసిద్ధి వినాయకుడి సన్నిధిలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి అన్న సమారాధనను ప్రారంభించారు. 3 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాలుగు వార్డుల సమన్వయకర్త మహ్మద్ గౌస్, నాయకులు సయ్యద్ హుస్సేన్ బ్రదర్స్, వినాయక ఉత్సవాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి



మాట్లాడుతున్న ఆచార్య అజిత్‌కుమార్

అగనంపూడి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని, వాటిని సాధించేందుకు ప్రయత్నించాలని ప్రఖ్యాత మోటివేటర్ ఆచార్య అజిత్‌కుమార్ జీ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్‌స్పైరింగ్ అండ్ మోటివేటింగ్ ఆఫ్ యంగ్ మైండ్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆశయాన్ని నెరవేర్చుకోవడం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పాజిటివ్ ఆలోచనలు ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, డీన్ భాస్కరరావు తదితరులు మాట్లాడారు.

ఉత్కంఠభరితంగా టెన్నికాయిట్ పోటీలు

- 300 మంది క్రీడాకారులు హాజరు
- అండర్ 14, 17 విభాగాల్లో ఎంపికలు



తలపడుతున్న క్రీడాకారులు

పరవాడ/అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు, ఎంపికలు పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం చేపట్టారు. ఈ పోటీల్లో 15 నియోజకవర్గాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14, 17 (బాలురు, బాలికలు) విభాగాల్లో పోటీలు నిర్వహించి ఎంపికలు చేపట్టారు. పోటీలను ఎంపీపీ పైల వెంకటపద్మ లక్ష్మి శ్రీనివాస్, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు (పీఎస్‌రాజు) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తుందన్నారు. అందుకు తగ్గట్టుగా క్రీడలకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. రాష్ట్ర జట్టులో తలపడనున్న జట్లను కూడా ఎంపిక చేశారు. వీరికి క్రీడా దుస్తులకు గ్రామ సర్పంచ్ నాగమణి, ఆమె కుమారుడు కబడ్డీ అప్పారావు రూ.10 వేల నగదు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు దివాకర్, గొంతిన సాయి శైలజ, పాఠశాల హెచ్‌ఎం కె.కృష్ణ, గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, కబడ్డీ అప్పారావు, అనకాపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, పాఠశాల పీడీ ఎస్.వి.రమణ, వైఎస్ ఎంపీపీ బూస అప్పలరాజు, పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత: క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీ రవిబాబు పాల్గొని బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ పెద్దినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.ఎం.నాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ దాలిబోయిన పైడిరాజు, సభ్యులు కె.సత్యనారాయణ, వై.బుజ్జి పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రొటీన్ పౌడర్ అందజేత



మహిళకు ప్రొటీన్ పౌడర్ అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

అగనంపూడి: రోటరీ క్లబ్ విశాఖపట్నం సహకారంతో అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో 160 మంది గర్భిణులు, బాలింతలకు ప్రొటీన్ పౌడర్ అందించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, క్లబ్ అధ్యక్షుడు ఉమామహేశ్వర రెడ్డి మహిళలకు పౌడర్ ప్యాకెట్లు, ఐరన్ సిరప్ అందించారు. ప్రొటీన్ పౌడర్ అందించేందుకు సహకారం అందించిన జి.రామకృష్ణరాజు, క్లబ్ ప్రతినిధులు కె.శ్రీనివాసరావు, జోగారావు, చట్టి అప్పారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను విరమించే వరకు ఉద్యమం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం విరమించే వరకు ఉక్కు ఉద్యమం కొనసాగుతుందని పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 958వ రోజు సంస్థకు చెందిన ఎస్‌ఎంఎస్–1 విభాగ కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఉక్కు స్మృత్యంజలి పార్కు వద్ద సభ

ఉక్కునగరం: సీపీఎం ఆధ్వర్యంలో ఉక్కు స్మృత్యంజలి పార్కు వద్ద గురువారం ఉదయం 8 గంటలకు సభ నిర్వహిస్తున్నట్లు స్టీల్ డివిజన్ సీపీఎం కార్యదర్శి పి.శ్రీనివాసరాజు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నిర్వహిస్తున్న బైక్ యాత్రలో భాగంగా నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని కోరారు.

త్రోబాల్ ఎంపికలు వాయిదా

అగనంపూడి: ఈ నెల 30న నిర్వహించాల్సిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్–17 బాలురు, బాలికల విభాగం త్రోబాల్ పోటీలు, ఎంపికలు వాయిదా వేసినట్టు ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. 30వ తేదీన స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించేందుకు విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో త్రోబాల్ ఎంపికలు వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.

విలువలు జీవితంలో భాగం కావాలి

గాజువాక: విలువలు ప్రతి ఒక్కరికీ తమ జీవితంలో భాగంగా ఉండాలని సురేఖ గ్రూప్ ప్రతినిధి ఫణికుమార్ అన్నారు. మానవతా విలువలు, భావ ప్రకటన నైపుణ్యాలపై స్థానిక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విలువలను జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా మంచి భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్ర మహాలక్ష్మి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ముగిసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు

అగనంపూడి: పెదమడకలోని సంపత్ వినాయక ఆలయం ఆవరణలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. జెడ్పీ సింహాచలం పాల్గొని విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.